ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

కల్లూరు: ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలియజేయడానికి పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు లాంటివి తీసుకురావాలన్నారు.

రైతులకు సలహాలు, సూచనలివ్వండి

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పాదకత సాధించే పద్ధతులపై అవగాహన పెంచండి
- ఇన్‌పుట్ డీలర్లకు విశ్రాంత డీడీఏ భగవత్ స్వరూప్ సూచనలు


దేశీ కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్రాంత డీడీఏ భగవత్ స్వరూప్

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు తగిన సాంకేతిక సలహాలు ఇచ్చి సహకరించాలని విశ్రాంత డీడీఏ భగవత్ స్వరూప్ ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమ కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. గతంలో ఇన్‌పుట్ డీలర్లకు ఎలాంటి శిక్షణ కార్యాక్రమాలు లేవని, ఇందువల్ల రైతులకు సరైన సలహాలు,సూచనలు అందేవి కావని పేర్కొన్నారు. రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్లనే ఆశ్రయిస్తున్నందున ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని డిప్లొమ కోర్సుపై శిక్షణ ఇస్తోందని తెలిపారు. వివిధ పంటలకు సోకే చీడపీడలకు సంబంధించి రైతులకు చక్కటి సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పాదకత సాధించే విధంగా రైతులకు సహకరించాలని పేర్కొన్నారు. దేశీ కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ... శిక్షణలో చెప్పే అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా రైతులకు మంచి సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సి.బెళగల్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. పలుకుదొడ్డి, గుండ్రేవుల గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పథకాల గురించి వివరించారు. ఏఈఓ సిద్ధు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న, ఎంఈఓ ఆదాంబాషా, పలుకుదొడ్డి సర్పంచ్ లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

కొత్తగా 120 మందికి పింఛన్లు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో కొత్తగా 120 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు మొత్తం 10,326 మందికి పింఛన్లను అందజేస్తున్నారు. ఇందుకు ప్రతి నెల రూ.2,88,47,500 నగదు పంపిణీ చేస్తున్నారు. ఈ నెల నుంచి కొత్తగా మరో 120 మందికి రూ.21,67,500 అందజేయనున్నారు. ఎన్నికల సమయంలో అవ్వా,తాతలకు పింఛన్ మొత్తాన్ని విడతల వారీగా పెంచుకుంటూ రూ.3 వేల వరకు చేస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ నెల పింఛన్ మొత్తం రూ.3వేలు అందజేయనున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ సీఎం జగనన్న రాసిన లేఖ ప్రతులను కూడా లబ్ధిదారులకు అందజేయనున్నారు.

జానపద కళలు సంస్కృతి, సంప్రదాయాలకు ఆనవాళ్లు


బుర్రకథ చెబుతున్న కళాకారులు విభూతి బ్రదర్స్

కర్నూలు కల్చరల్: జానపద కళలు మన సంస్కృతి సంప్రదాయాలకు ఆనవాళ్లని వాటిని పోషించడంలో భాగంగా జానపద కళాకారుల ప్రదర్శన ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకర విషయమని క్లస్టర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. కేవీఆర్ కళాశాలలో డాక్టర్ పార్వతి దేవి, లక్ష్మయ్య ఏర్పాటు చేసిన దండబోయిన బాలరంగయ్య పాపులమ్మల స్మారక పురస్కార ఉత్సవంలో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుర్రకథ ప్రదర్శన ఆకర్షణీయంగా ఉందన్నారు. ఇది విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. క్లస్టర్ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసులు మాట్లాడుతూ తల్లిదండ్రులను, సంస్కృతిని ఉన్న ఊరును గౌరవించడం ప్రేమించడం వంటి విలువలు విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ కళాశాల మాట్లాడుతూ జానపద కళారూపాల్లో ఒకటైన బుర్రకథ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమన్నారు. సొంత ఊరు బాంధవ్యాలను నిలుపుకోవడంలోనే గొప్ప తృప్తి ఉంటుందన్నారు. అందరూ సొంత ఊరికి ఏదైనా చేయాలని సామాజిక సేవలో పాల్గొనాలన్నారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య మాట్లాడుతూ ఈనాటి తరం మన ప్రాచీన కళారూపాలను తెలుసుకునే విధంగా బుర్రకథ ఏర్పాటు చేయడం వారికి అవార్డు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ఆర్‌కే శర్మ మాట్లాడారు. రాజమహేంద్రవరం బుర్రకథ కళాకారులు విభూతి బ్రదర్స్‌కు రూ. 15,000 నగదు పురస్కారం శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాంటిస్సోరి విద్యాసంస్థల చిన్నారుల జానపద నృత్య ప్రదర్శనలు, బసవరాజు, అంకయ్యల పాటల కచేరి అలరించింది. కార్యక్రమంలో పలు రంగాలకు చెందిన ప్రముఖులు, సాహితీ వేత్తలు మనోహర్, గంగాధర్, హరిచంద్ర రెడ్డి, పోతన, సురేష్ బాబు, డాక్టర్ చంద్రమౌళి, నీలిమ, సీత మహాలక్ష్మి, మానస, రమేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరాలయం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం 2024 సంవత్సరం క్యాలెండర్‌ను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదివారం విడుదల చేశారు. కల్లూరులోని ఎమ్మెల్యే ఇంటి వద్ద ఆలయ చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్ రెడ్డి, ఈఓ చంద్రశేఖరరెడ్డి, ధర్మకర్తల ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ, ధర్మకర్తలు సరేంద్రనాథ్‌రెడ్డి, శివుడు, ఆలయ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే లోపాలను సరి చేయండి

ఓర్వకల్లు: భూరక్ష పథకంలో భాగంగా చేపట్టిన రీ సర్వేలో లోపాలను సరి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ముఖ్య కార్యదర్శుల సమావేశంలో రామకృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి నాగన్న మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన రీ సర్వే ఆర్థిక స్థోమతలేని నిరుపేద రైతులకు ఉపయోగకరంగా ఉందన్నారు. అయితే ఓ భూమిని సర్వే చేసేముందు చుట్టుపక్కల రైతులకు ముందస్తుగా నోటీసులు జారీ చేస్తే బాగుండేదన్నారు. లేదంటే గ్రామ సభలు నిర్వహించి వుంటే రైతులకు ఏవిధమైన సమస్యలు వుండేవికాదన్నారు. నాయకులు చంద్రబాబునాయుడు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

దొంగల అరెస్టు

కర్నూలు : కర్నూలు రెండో పట్టణ పోలీసులు ముగ్గురు దొంగలను అరెస్టు చేసి కటకటాలకు పంపారు. పర్ల గ్రామానికి చెందిన సుధాకర్ డాక్టర్ దగ్గర వైద్యం చేయించుకుని మున్సిపల్ కార్యాలయం దగ్గర ఆటో ఎక్కి కొత్తబస్టాండ్‌కు వెళ్తుండగా ముజఫర్ నగర్‌కు చెందిన జుబేర్, భాస్కర్, షేక్‌షావలి ప్రయాణికుల వలే ఆటోలో ఎక్కారు. సుధాకర్ జేబులో ఉన్న రూ.10 వేలు నగదు కొట్టేసి మార్గమధ్యంలో దిగిపోయారు. బస్టాండ్‌కు వెళ్లిన తర్వాత జేబులో డబ్బులు చూసుకోగా కనిపించకపోవడంతో చోరీ చేశారని నిర్ధారించుకుని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి దొంగలను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

ఘనంగా ఉరుసు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని టెక్కెలో వెలసిన హాజరత్ సయ్యద్‌షా నూరుల్లా సాహెబ్ దర్గా ఉరుసును మతసామరస్యానికి ప్రతీకగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి సాయంత్రం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. నిర్వాహకులు సయ్యద్ అఫీజ్ అహమ్మద్ ఖాద్రి చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేపట్టారు.